క్లుప్తంగా

కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి



కౌలు కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, సర్పంచి అలకానంద శ్రీనివాస్

ఉంగుటూరు: బహుళ ప్రయోజనాలు చేకూరే కౌలు కార్డుల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని మండల ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు అన్నారు. మంగళవారం నారాయణపురం సచివాలయంలో సర్పంచి అలకానంద శ్రీనివాసుతో కలిసి కౌలు రైతులు కార్డులు పంపిణీ నాగరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్క కౌలురైతు కౌలు కార్డులు పొందాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, వీఆర్వో భాస్కరరావు, రైతుల సేవా ఉద్యోగులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

మురుగు కాలువలో తూడు తొలగింపు



బాదంపూడి మురుగు కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: మురుగు కాలువలో గుర్రపు డెక్క, తూడు పేరుకుపోవడంతో వాటిని వెంటనే తొలగించాలని రైతులు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కోరడంతో ఈ సమస్యపై దృష్టి సారించాలని ఆయన అధికారులకు సోమవారం సూచించారు. బాదంపూడి నుంచి నాచుగుంట వరకు ఉన్న క్వారీ మురుగు కాలువలో గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టడంతో మంగళవారం ఎమ్మెల్యే ధర్మరాజు పరిశీలించారు. డ్రెయిన్‌లో పూడిక తొలగింపు పనులను ఆయన పరిశీలించారు.

ఆర్థిక సాయం అందజేత

ఇటీవల ప్రమాదవశాత్తు గాయాలపాలైన గణపవరం మండలం చిలకంపాడు చెందిన ఇనపకుర్తి గోపికి రూ.50 వేలు బీమా చెక్కును, జల్లికాకినాడకు చెందిన నీలపాటి నర్సింహ మూర్తికి రూ.25.96వేల ఆర్థికసాయం చెక్కును ఎమ్మెల్యే ధర్మరాజు అందజేశారు. మంగళవారం ఉంగుటూరులో పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన జనసేన పార్టీ శ్రేణుల సమావేశంలో క్రియాశీలక సభ్యత్వ నమోదుపై దిశానిర్దేశం చేశారు.

రోడ్లు, డ్రెయిన్ల పరిశీలన



వేగివాడలో రోడ్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు: గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'మీ కోసమే- చింతమనేని' కార్యక్రమం దెందులూరు నియోజకవర్గంలో ప్రారంభించినట్టు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళవారం పెదవేగి మండలం వేగివాడ, చక్రాయగూడెం, మొండూరులో నాయకులు, ఉద్యోగులతో కలిసి రోడ్లు, డ్రెయిన్లను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్, మూడు గ్రామాల కూటమి నాయకులు తాతా సత్యనారాయణ, వేగివాడ సర్పంచ్ పంది ప్రభావతి సూర్యచంద్రరావు, కనికళ్ల శివమణి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో, యనమదల రామస్వామి సత్రంలో దాతల సాయంతో మంగళవారం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన పర్వతనేని వెంకటసుబ్బారావు ప్రభావతమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకటేశ్వరరావు ఆర్థిక సాయం అందించారు. తొలుత ఆలయం వద్ద స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం అందజేత

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో తెనాలి డబుల్ హార్స్, లెప్రో సొసైటీ ఆధ్వర్యంలో ఐదుగురు కుష్టు వ్యాధి బాధితులకు హాస్పటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసరావు చేతులు మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా లెప్రో సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ రాధిక మాట్లాడుతూ తెనాలి డబుల్ హార్స్ సంస్థ సహకారంతో 20 మంది కుష్టు, బోద వ్యాధి బాధితులకు సూక్ష్మ రుణాలను అందజేశామన్నారు. ఆయా కుటుంబాల్లోని విద్యార్థుల చదువులకు అండగా నిలుస్తూ ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. ప్రాజెక్టు అసోసియేట్ అబ్దుల్ వహీద్ బాషా, డీపీఎంఓ సత్యనారాయణ, సంస్థ ప్రతినిధులు ఖోస్లా, రాణి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విత్తన ఎంపిక సాగులో కీలకం

- అధిక దిగుబడికి ఉపయుక్తం
- విత్తన కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి
- దుకాణదారులు, విత్తన ఉత్పత్తిదారులు నిబంధనలు పాటించాలి



రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

పెదపాడు: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యాపారులు ఇప్పటికే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. కొన్ని చోట్ల రైతులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. విత్తనాలు ఎంపికలో అప్రమత్తమై తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. పెట్టుబడి, పంట కాలం వృథాఅయ్యే ప్రమాదం ఉంది. అన్నదాతల అమాయకత్వం, నిరక్షరాస్యతను ఆసరా చేసుకుని పల్లెల్లో నకిలీ విత్తనాలు, అంటగట్టే అవకాశముంది. ఇప్పటికే వ్యవసాయ, విజిలెన్స్ శాఖలు తమ సిబ్బందితో తనిఖీలు చేపడతున్నాయి. తనిఖీలు చేపడుతున్నప్పటికీ రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మండలంలో ప్రభుత్వ ఆమోదం పొందకుండా కొంత మంది విత్తనాలను విక్రయిస్తున్నారు. తనిఖీల సందర్భాల్లోనే అధికారులు కేసు నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నియోజకవర్గంలో 50,400 ఎకరాల్లో వరిసాగు

దెందులూరు నియోజకవర్గంలో 50,400 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. పెదపాడు మండలంలో 17,500 ఎకరాలు, దెందులూరు మండలంలో 17,280 ఎకరాలు, పెదవేగిలో 7,500, ఏలూరు రూరల్‌లో 8,120 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 1000 టన్నులు విత్తనాలు అవసరముందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే రైతులకు అందుబాటులో విత్తనాలు ఉంచినట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు 509 క్వింటాళ్ల విత్తనాలు ఒక కేజీకి రూ.5 చొప్పున సబ్సిడీపై అందించారు. నియోజకవర్గంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. మార్కెట్‌లో విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ జారీ చేసిన లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు పురుగు మందులు కొనుగోలు చేయాలి. దుకాణదారులు తప్పనిసరిగా విక్రయ లైసెన్స్‌ను ప్రదర్శించాలి.
- కొనుగోలు చేసిన విత్తనాలకు బిల్లు తీసుకోవాలి
- కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా డీలరు నుంచి లాట్ నంబరు, వెరైటీ పేరుతో రసీదులు తీసుకోవాలి. పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలి.
- విత్తన ప్యాకెట్లు, బస్తాలపై లాట్ నంబరు కంపెనీ పేరు, ప్యాకింగ్ తేదీ, టేబుల్ వివరాలను పరిశీలించాలి.
- విత్తనాలు మొలక శాతం సరిగ్గా ఉందోలేదో చూసుకోవాలి. విడిగా విక్రయించే విత్తనాలు కొనుగోలు చేయరాదు.

రసీదులు తప్పని సరి



రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నాం. విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలి. కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా రసీదులు పొందాలి. పంట కాలం పూర్తయ్యేవరుకు వాటిని భద్రపర్చుకోవాలి. ఒకవేళ విత్తనాలు ఆశించిన మేర మొలకెత్తకపోయినా, దిగుబడి రాకున్నా కంపెనీ నుంచి నష్ట పరిహారం పొందవచ్చు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలి.

– వై సుబ్బారావు, ఏడీఏ, వ్యవసాయ శాఖ, ఏలూరు

నేత్రదానం ఆదర్శనీయం



నేత్రదానం చేసిన ఆర్టీసీ డ్రైవర్ దివంగత బాబూరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జిల్లా యాదవ సంఘ నాయకులు

దెందులూరు: ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ, యాదవ సామాజిక వర్గానికి సేవలందించడమేకాక మరణానంతరం తన కళ్ల ద్వారా మరొకరికి చూపు ప్రసాదించిన కొలుసు నాగ వెంకట సత్యనారాయణ (బాబూరావు) ఆలోచనా విధానం ఆదర్శనీయమని జిల్లా యాదవ సంఘం నాయకులు అన్నారు. మంగళవారం దెందులూరు బాబూరావు నివాసంలో ఆయన చిత్రపటానికి ఏలూరు జిల్లా యాదవ సంఘం నాయకులు చిదరబోయిన శ్రీనివాసరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు శ్రీనివాసరావు, గొర్ల రామారావు, బొట్టా అజయ్, కొలుసు కృపానందం, బోగా రాజేష్, వైఎస్సార్‌సీపీ నేత, దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ కొలుసు గణపతిరావు బాబూరావు సేవలను కొనియాడారు. ఆయన కుమారులు కొలుసు నాని, కొలుసు శివ, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

ముమ్మరంగా వరినాట్లు



ఉంగుటూరు ఆయకట్టులో ట్రాక్టరుతో దమ్ము చేస్తున్న దృశ్యం



ఎ.గోకవరం ఆయకట్టులో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

తరలివచ్చిన బెంగాలీ కూలీలు

ఉంగుటూరు: మెట్ట, డెల్టా ప్రాంతాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పొలాల్లో నాట్లు వేయడంతో పచ్చగా దర్శనమిస్తున్నాయి. ఉంగుటూరు మండలంలోని మెట్ట, డెల్టా ప్రాంతాల్లో వరి నాట్లు వేస్తున్నారు. గోదావరి కాలువ నీటితో సేద్యం చేసే రైతులు ట్రాక్టర్లతో దమ్ములు పూర్తి చేశారు. డెల్టాలోని శివారు భూములకు సాగు నీరు చేరక రైతులు ఎదురుచూస్తున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో మెట్ట ప్రాంతంలో, బోర్ల కింద ఆయకట్టులో వ్యవసాయం చేసే రైతులు దమ్ము పనులు పూర్తి చేసి నాట్లు వేస్తున్నారు. మండలం పరిధిలో ఇప్పటి వరకు 12,800 ఎకరాల్లో నాట్ల పనులు పూర్తయ్యాయి. ఇంకా 15,960 ఎకరాల్లో నాట్లు పూర్తి చేయాల్సి ఉంది. స్వర్ణ, సంపద స్వర్ణ, పీఎల్ ఏ 1100 రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలంలోనే వరి ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. దీంతో వ్యవసాయ అధికార్లు బాలిన వెంకటేష్, ఏఏలు రైతులకు సూచనలు, సలహాలివ్వడంపై దృష్టి సారించారు. బాదంపూడి, నాచుగుంట వెల్లమిల్లి, నీలాద్రిపురం, ఉంగుటూరు, నారాయణపురం, కైకరం, చేబ్రోలు పరిధిలో జోరుగా వరి నాట్లు వేస్తున్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యం



పోలిశెట్టి సత్యనారాయణకు నియామక పత్రాలను అందిస్తున్న జిల్లా చైర్మన్ మణికంఠ

భీమడోలు: వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు జిల్లా వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్ లింగంపల్లి మణికంఠ అన్నారు. భీమడోలుకు చెందిన పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణను ద్వారకాతిరుమల మండలం ఇన్‌చార్జిగా నియమించారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంఠ పోలిశెట్టి వెంకట సత్యనారాయణకు నియమాక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో వినియోగదారులు మోసపోతున్నారన్నారు. వినియోగదారులకు అవగాహన కల్పించడం ద్వారా హక్కులను కాపాడుకోవచ్చన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. వినియోగదారులు మోసపోయినట్లయితే వారు తమ కమిషన్‌ను సంప్రదించాలని కోరారు. వారికి న్యాయం జరిగేంత వరకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు ఇన్‌చార్జిలను నియమిస్తున్నామన్నారు.

శ్రీశయనుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి



ప్రమాణస్వీకారం చేస్తున్న శ్రీశయన సంక్షేమ సంఘం కమిటీ

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగర శ్రీశయన సంక్షేమ సంఘం అభివృద్ధికి తన శాయ శక్తులా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు లొట్టి రమేష్ తెలిపారు. ఏలూరు నగర శ్రీ శయన కుల సంక్షేమ సంఘ సమావేశం సెంట్రల్ కమిటీ సీనియర్ నాయకులు రుప్పా రాంబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ టీడీపీ శ్రీ శయన సాధికారిక కమిటీ అధ్యక్షుడు పట్నాల వెంకటేష్ బాబు, ఏపీ రాష్ట్ర శ్రీశయన కమిటీ అధ్యక్షుడు లోడ అప్పారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు సంఘం సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడారు. ఏలూరు నగర శ్రీశయన సంక్షేమ సంఘానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి గౌరవ అధ్యక్షుడిగా కోలా కనకారావు, గౌరవ సలహాదారుడిగా ఓలిపల్లి చంద్రశేఖర్, అధ్యక్షుడిగా లొట్టి రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బోగాది ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా చలపతి ఉమామహేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పెంటా శ్రీనివాస్, కోశాధికారిగా పూతి రాజు, ఉపాధ్యక్షులుగా పట్నాల మోహనరావు, లొట్టి త్రినాథ్‌రావు, తాబేలు మోహనరావు, సహాయ కార్యదర్శిలుగా గుజ్జుల జగదీష్, కోలా బాల సుబ్రహ్మణ్యం, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘ సీనియర్ నాయకులు బుజ్జా భాస్కరరావు, లావేటి రామాంజనేయులు, సింగవరపు ప్రసాదరావు, కోలా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



భీమడోలులో విభిన్న ప్రతిభావంతుల రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై వై.సుధాకర్, వికలాంగుల హక్కుల సమితి రాష్ట్ర నాయకులు

భీమడోలు: రక్తదానం ప్రాణదానంతో సమానమని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలు అమ్మవార్ల ప్రాంగణంలో మంగళవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం, నాయకులు కనుమూరి లీలా కృష్ణల ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతులు తరలి వచ్చి రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. తొలుత ఈ రక్తదాన శిబిరాన్ని ఎస్సై సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రక్తదానంపై ఉన్న అపోహలను ప్రతి ఒక్కరూ విడనాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. వారిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందించారు. సేకరించిన రక్తాన్ని బ్లడ్ బ్యాంకు తరలించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు ప్రత్తి మదన్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.శేఖర్ మాదిగ, బయ్యారపు రాజేశ్వరరావు, కొత్తపల్లి చంద్రమౌళి, కాటూరి జోగేశ్వరరావు, విభిన్నప్రతిభావంతుల పోరాట సమితి మండల నాయకులు ఉండ్రు బెంజిమన్, కొత్తపల్లి చంద్ ప్రకాష్, బ్లడ్ బ్యాంకు యూనిట్ వైద్యురాలు ఆశ్విని, సహాయకులు పరమేశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

27న రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాప్

దెందులూరు: కాకినాడలో ఈ నెల 27న అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ (ఏఏఎఫ్) రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీల న్యాయవాదుల, జర్నలిస్టుల సమావేశం కాకినాడ పట్టణం డీ-కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నట్టు చైర్మన్, న్యాయవాది పినిపే వెంకటరామకృష్ణ అన్నారు. జిల్లాల్లో ప్రచారంలో భాగంగా రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాప్‌పై మంగళవారం అలుగులగూడెం, మలకచర్ల, పెరుగ్గూడెంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులు, న్యాయవాదులు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, విద్యావైద్య అధికారుల మేధావులు హాజరుకావాలని కోరారు.

కౌలు రైతులకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్) : జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలు రైతులకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవన్‌లో మంగళవారం నిర్వహించిన కౌలు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నూటికి 70 శాతం భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు రుణ కేటాయింపులో బ్యాంకర్లు అన్యాయం చేయడం తగదన్నారు. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళిక రూ.7,300 కోట్లు కాగా, కౌలు రైతులకు రూ.250 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసి చేతులు దులుపుకోవడం దారుణమని విమర్శించారు. కౌలు రైతులకు రూ.2 వేల కోట్లు రుణాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలంటూ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు భూయజమానులతో సంబంధం లేకుండా పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. సమావేశంలో కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, నాయకులు డి. కేశవ పాల్గొన్నారు.

దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్



దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో దోమల నివారణకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా ఎమ్మెల్యే బడేటి చంటి ఆదేశాల మేరకు మలేరియా విభాగంతో కలిసి నగరపాలక సంస్థ 14వ డివిజన్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పోణంగిలోని దళితపేట, వెలమపేట, ఎస్సీ కాలనీ, సాయిబు పేట, సవర్ల పేట, కాపుపేట, పాతపోణంగి తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రెయింగ్, మురుగు కాలువల్లో కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లోని నీటి నిల్వ ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతీ మాట్లాడుతూ నగరంలో దోమల నివారణకు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, బోసుబాబు, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల్, కె.శ్రీనివాసరావు, పి.శ్యామ్, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్త ఉన్నారు.

దేశ రక్షణ కోసమే అగ్నివీర్



అగ్నివీర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : దేశ రక్షణ కోసమే కేంద్ర ప్రభుత్వం అగ్నివీర్ పథకాన్ని అమలు చేస్తోందని సీఆర్ఆర్ అటానమస్ కళాశాల కరస్పాండెంట్ కేఏస్ విష్ణుమోహన్ అన్నారు. స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాల ఆడియో విజువల్ హాల్‌లో కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రెనింగ్, సెట్‌వెల్, సీఆర్ఆర్ ఎన్‌సీసీ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అగ్నివీర్ పథకంపై ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి ఎస్ సందీప్, జిల్లా నేషనల్ కేర్ సర్వీస్ కోఆర్డినేటర్ పి.ప్రవీణ్ కృష్ణ, సెట్‌వెల్ మేనేజర్ పి.సత్యనారాయణ, మాట్లాడుతూ అగ్నివీర్ పథకం అమలయ్యే పద్ధతి, ఈ పథకాన్ని ఎలా వినియోగించుకోవాలి, సైన్యంలో చేరడంలో ముఖ్య అంశాలు, పథకం ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి ఎ.ధర్మేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై పెరిగిన మక్కువ

- రసాయన ఎరువులు, పురుగు మందులపై అనాసక్తి
- సాగుకు తగ్గుతున్న వ్యయం



రసాయన ఎరువుల నిల్వలు

దెందులూరు: దేశానికి అన్నం పెట్టే రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. పెట్టుబడి వ్యయం పెరుగుతుండటం, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పులపాలవుతున్నారు. పెట్టుబడి వ్యయం పెరగడంతో వ్యవసాయం చేయడానికి రైతులు సంకోచిస్తున్నారు. పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన దెందులూరు నియోజకవర్గంలో క్రమేపీ ఎరువులు, పురుగు మందులపై రైతాంగం అనాసక్తి చూపుతున్నారు. సాధారణ పంటలు, అంతర పంటల్లో అద్భుతాలు సృష్టించే ఈ నియోజకవర్గ రైతులు భూసారం, దిగుబడి పెరుగుతున్న ఖర్చుల దృష్ట్యా సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి దారుణంగా మారింది. ఈ తరుణంలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో 50 వేల ఎకరాల్లో పంట సాగవుతుంది. ఎరువుల ధరలు పెరగడంతో సాగుకు అధిక వ్యయమవుతుందని రైతులు మదనపడుతున్నారు.

పాత పద్ధతులే మేలు

రైతులు సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం చేస్తే రసాయనిక ఎరువుల వాడకం తగ్గడంతో పాటుగా పెట్టుబడి వ్యయం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. పూర్వం పశువుల పేడ, పచ్చిరొట్ట ఎరువుల వాడకం అధికంగాఉండేది. కాలక్రమేణ పోటీతత్వంతో రైతులు రసాయనిక ఎరువుల వాడకం వైపు మొగ్గు చూపడంతో పెట్టుబడి వ్యయం అమాంతం పెరిగింది. రసాయనిక ఎరువులను అధికంగా వాడటం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు వాటితో పండించిన పంట ఉత్పత్తులు తినడం వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గాలి

రైతులు రసాయనిక ఎ రువులు వాడకం తగ్గించాలి. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి. సేంద్రియ ఎరువుల వాడకంపై మొగ్గు చూపాలి. పశువుల పేడ, ఎకరాకు 10 టన్నులు వేయాలి. జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులను భూమిలో కలియదున్నాలి. ఈ విధంగా చేయడం వల్ల రసాయనిక ఎరువుల వాడకంతోపాటు పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. ప్రజల ఆరోగ్యంపై ఎటువంటి దుష్ప్రభావం ఉండదు. సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుంది. తక్కువ వ్యయంతో అధిక దిగుబడి లభిస్తుంది.సాగులో ప్రకృతి వ్యవసాయ శాఖ సలహా, సూచనలు పాటించాలి.